



ఆగని అక్రమ నిర్మాణాలు



బైపాస్ రోడ్డులో నాలాపై నిర్మించిన స్లాబు

- ఓ వైపు కూల్చివేతలు, మరోవైపు నిర్మాణాలు
- నాలాలపై యథేచ్ఛగా వెలుస్తున్న కట్టడాలు
- జిల్లా కేంద్రంలో అడ్డూఅదుపులేని అక్రమ నిర్మాణాలు
- బహుళ అంతస్థుల భవన యాజమాన్యాల ఇష్టారాజ్యం
- నిబంధనలు విస్మరిస్తున్నా పట్టని మున్సిపల్ అధికారులు

మంచిర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ, అదుపులేకుండా పోతోంది. ఓ వైపు మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపిస్తుండగా, మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తుండటం గమనార్హం. అక్రమ కట్టడాలు అని తెలిసి కూడా బహుళ అంతస్తుల భవనాల యజమానులు నిర్మాణ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం కొసమెరుపు.

రోడ్డు ఆక్రమణలపై కొరడా

జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల్లో రోడ్ల ఆక్రమణలపై ఇటీవల మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రధానంగా బాలుర ఉన్నత పాఠశాల, మార్కెట్ రోడ్డు, అర్చన టెక్స్ చౌరస్తాలో రోడ్లను ఆక్రమించి వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారు. అధికారులు తొలగిస్తున్న వాటిలో చిరు వ్యాపారులు మొదలుకొని బడా బాబులకు చెందిన భవనాలు ఉన్నాయి. అర్చన టెక్స్ చౌరస్తా నుంచి మొదలుకొని పోలీస్‌స్టేషన్ చౌరస్తా వరకు అక్రమ కట్టడాలను తొలగించాలని ముందస్తుగా నోటీసులు జారీ చేశారు.

దీంతో ఆయా నిర్మాణాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగిస్తుండగా, మరికొన్ని చోట్ల అధికారులే కూల్చి వేయిస్తున్నారు. అయితే పండుగ సమయంలో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉండటంతో తొలగింపు ప్రక్రియకు కొంత విరామం ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలోనూ మున్సిపల్ అధికారులు ఆక్రమణలను తొలగించేందుకు యత్నించగా, అప్పట్లో మంచిర్యాల ఏసీపీగా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దీంతో మార్కెట్ రోడ్డులోని కొన్ని బహుళ అంతస్తుల భవనాల మెట్లను తొలగించారు. అయితే ఆ తరువాత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అక్రమ కట్టడాల తొలగింపు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఫలితంగా రోడ్డు ఆక్రమణలు మరింతగా విస్తరించాయి. ప్రస్తుతం అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించడంతో ఇప్పటికైనా రహదారి ఆక్రమణల తొలగింపు ముందుకు సాగుతుందా..! అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమతున్నాయి.

నాలాలపై వెలుస్తున్న నిర్మాణాలు....

గతంలో ఖాళీగా ఉన్న రోడ్డు ఆక్రమణలతోనే పరిమితమైన అక్రమ నిర్మాణాలు తాజాగా నాలాలపై వెలుస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన పెద్ద పెద్ద నాలాలను నిర్మించారు. వర్షాకాలంలో వరద పోటు సమస్య తలెత్తకుండా ఈ చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఏసీసీ చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా వరకు, మార్కెట్ రోడ్డులో, బైపాస్ రోడ్డులో, ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపంలో, హమాలివాడ, గౌతమీ నగర్, పాత మంచిర్యాలలో ప్రధాన రహదారుల వెంట విశాలమైన నాలాలు దర్శనమిస్తున్నాయి. అయితే వాటిపై అక్రమ నిర్మాణాలు చేపడుతూ కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారు. దీంతో నాలాలు ఇరుకుగా మారి, వరదల సమయంలో వర్షం నీరంతా రోడ్ల పైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 20 22 జూలైలో కురిసిన భారీ వర్షాల కారణంగా నాలాల నుంచి నీరు రోడ్లపై ప్రవహించింది. దీంతో సమీపంలోని ఇళ్లలోకి వరద నీరు చేరింది.

రెండేళ్ల క్రితం మంచిర్యాల- బెల్లంపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న విశాలమైన నాలాలో బజాజ్ షోరూం సమీపంలో కొందరు బడా వ్యాపారులు పెద్ద గుంతలు తీసి, ఏకంగా పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. నాలాపై స్లాబు నిర్మించడం ద్వారా రహదారి నుంచి భవనం వరకు అక్రమంగా రోడ్డు నిర్మించేందుకు యత్నించారు. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు పిల్లర్లను తొలగించారు. వాస్తవానికి నాలాలపై శాశ్వత కట్టడాలు నిర్మించరాదు. నాలాను దాటేందుకు తాత్కాలికంగా ఇతరత్రా ఏర్పాట్లు చేసుకోవాలి. ఇదిలా ఉండగా, ఇటీవల బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవన యజమాని నిబంధనలకు విరుద్ధంగా నాలాపై స్లాబు నిర్మించాడు. బైపాస్ రోడ్డు మొదలుకొని భవనం వరకు సుమారు ఆరు ఫీట్ల పొడవు, 12 ఫీట్ల వెడల్పుతో శాశ్వతంగా స్లాబు నిర్మించాడు. ఈ తతంగమంతా బహిరంగానే జరుగుతున్నా అధికారుల దృష్టికి రాకపోవడం శోచనీయం.



అర్చన టెక్స్ చౌరస్తాలో కూల్చిన నిర్మాణం (ఫైల్)

డీఎస్సీ ఫలితాల వెల్లడి

- జిల్లాలో 288 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక
- ఫోన్ ద్వారా సమాచారం అందించిన అధికారులు
- నేడు హైద్రాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేత
- ఎంపికైన వారిని తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తి

బెల్లంపల్లి, అక్టోబరు 8: డీఎస్సీ 2024 ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 288 మంది డీఎస్సీ అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియామకం కానున్నారు. వీరు దసరా సెలవుల అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో కొలువుదీరనున్నారు. 1:3 అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించిన అధికారులు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయం 11 గంటలకు హైద్రాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనుండగా అభ్యర్థులను తరలించేందుకు జిల్లా కేంద్రంలో బస్సులను ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

జిల్లాలో 288 మందికి ఉద్యోగాలు

డీఎస్సీ 2024 పరీక్షలు రాసి ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలన జరగగా 288 మంది ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు తెలుగు 165, ఉర్దూ 11, స్పెషల్ ఎడ్యుకేషన్ 23, భాషా పండితులు హిందీ 6, తెలుగు 8, ఉర్దూ 2, పీఈటీ 3, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ 15, ఇంగ్లీష్ 5, హిందీ 6, తెలుగు 16, భౌతిక 2, సాంఘీక శాస్త్రం 26 పోస్టులు మొత్తం 288 పోస్టులకు ఎంపికయ్యారు. అధికారులు సమాచారం అందిస్తామని తెపలడంతో అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎంపికైన అభ్యర్థులందరికి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోన్‌ల ద్వారా సమాచారం అందడంతో ఆనందం వ్యక్తం చేశారు.

జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన 288 మంది అభ్యర్థులకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి హైద్రాబాద్‌లో నియామక పత్రాలు అందజేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులను హైద్రాబాద్‌కు తీసుకువెళ్లేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆరు బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం 5 గంటలకు జిల్లా కేం ద్రంలోని జిల్లా పరిషత్ బాలుర మైదానానికి రావాలని సమాచారం అందించారు. నాలుగు ఫొటోలతోపాటు ధ్రువీకరణ పత్రాలను తీసుకు రావాలని సూచించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

కుటుంబ సభ్యుల కృషితో
దేవునూరి అర్జున్, బెల్లంపల్లి



తండ్రి కూలీ పనులకు వెళితే తల్లి కూరగాయలు విక్రయించేది. చిన్నప్పటి నుంచి సోదరి స్ఫూర్తి దాయకమైన మాటలతో ముందుకు వెళ్లాను. కో ఆపరేటివ్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా నా భార్య విధులు నిర్వహిస్తుంది. భార్య ప్రోత్సాహంతో డీఎస్సీలో 8వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాను.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాధించాను
జె. విజయ్, బెల్లంపల్లి



ఎన్నో కష్టాలు ఎదుర్కొని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు సాధించాను.కష్టపడి చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు ప్రోత్సహించే వారు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా లైబ్రరీలో చదువుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. నాకు ఉద్యోగం వచ్చిందని అధికారులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు సంతోషించాను.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేతను వ్యతిరేకిస్తున్నాం
మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



మాట్లాడుతున్న నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 8: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేతను తాము వ్యతిరేకిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిషన్‌కు కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అని, గడిచిన 8 నెలల్లో ఆయన ఎంత కమీషన్ తీసుకున్నాడో మా దగ్గర చిట్టా ఉందన్నారు. ఎమ్మెల్యే కూల్చివేతలే పనిగా పెట్టుకున్నారని, ఐబీలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ భవనాలను కూల్చివేశారని, ఆ కూల్చివేతల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనానికి నష్టం వాటిల్లిందన్నారు. మార్కెట్‌లోని వ్యాపార సముదాయాలను, ఆక్రమణల పేరుతో అర్ధరాత్రి మార్కింగ్ చేసి కూల్చివేతలు చేపట్టారని, కూల్చివేతలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శ్మశానవాటికను ఆనాడు గోదావరి తీరంలో కడతామని భూమిని కొనుగోలు చేస్తే వ్యతిరేకించిన ఎమ్మెల్యే ఇప్పుడు అదే ముంపు ప్రాంతమైన మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో భూధాన్ బోర్డు భూమిలో శ్మశానవాటిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అది కూడా సమ్మక్క-సారలమ్మల ఇల్లార్ల వద్దనే శ్మశానవాటికను నిర్మిస్తున్నారని, దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోటీని తట్టుకుని ముందుకు...
నేడు వరల్డ్ పోస్టల్‌డే



మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 8: సాంకేతికత అందుబాటులోకి రావడంతో పోస్టల్ సేవలు తగ్గుముఖం పట్టాయి. గతంలో బంధువులు, స్నేహితుల క్షేమసమాచారాలు, ఉద్యోగాల కోసం దరఖాస్తు ఇలా ఉత్తర ప్రత్యుత్తరాలు పోస్టల్ శాఖ ద్వారా జరిగేవి. ప్రస్తుతం ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్ సేవలు అందుబాటులోకి రావడంతో పోస్టల్ సేవలు వెనుకబడ్డాయి. అయినప్పటికీ ప్రైవేటు రంగం నుంచి పోటీని తట్టుకుని తపాలా శాఖ సేవలందిస్తోంది. గతంలో ఉత్తరాల బట్వాడాకే పరిమితం కాగా కాలక్రమంలో అనేక సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం దేశంలో సుమారు 6 లక్షల మంది తపాల సిబ్బంది, 1.10 లక్షల కార్యాలయాల్లో సేవలందిస్తోంది. దేశంలో రైల్వే తర్వాత అతి పెద్ద వ్యవస్థ పోస్టల్ శాఖదే. స్పీడ్ పోస్టు కోసం దేశంలో 180 కేంద్రాలున్నాయి. వందకు పైగా దేశాలకు ఈ సౌకర్యం ఉంది. బంగారు నాణాలు, ఫారెన్ ఎక్ఛేంజ్ కరెన్సీ మార్చుకోవడం లాంటి అనేక సౌకర్యాలు అందిస్తుంది. సెల్‌ఫోన్, కంప్యూటర్లు ఇతర సాంకేతిక సాధనాలు అందుబాటులోకి వచ్చాక ఉత్తరప్రత్యుత్తరాలు మరుగునపడ్డాయి. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఇప్పటికి పోస్టుకార్డునే వినియోగిస్తున్నారు.

వరల్డ్ పోస్టల్‌డే నేపథ్యం: జపాన్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో అక్టోబరు 9న వరల్డ్ పోస్టల్ డే నిర్వహించాలని తీర్మానించారు. అప్పటి నుంచి తపాల శాఖ సేవలు అవసరాన్ని గుర్తిస్తూ యేటా ప్రపంచ తపాల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రజల జీవితాలు, వ్యాపారాల్లో తపాలశాఖ పోషించే పాత్ర గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. భారత తపాల శాఖను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అక్టోబర్ 1, 1854న ఏర్పాటు చేసింది.

పాత రైళ్లు పునరుద్ధరించండి



సౌత్ సెంట్రల్ జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మందమర్రి టౌన్, అక్టోబరు 8: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, ఓదెల, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, రేచినిలలో పాత రైళ్లను పునరుద్ధరించాలని, కొత్త రైళ్లను ప్రారంభించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ నాగ్యకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిలు వినతి పత్రం అందించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి రైళ్ల లేకపోవడం మూలంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. దీని పై వారు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు పరిజ్ఞానం

కోటపల్లి, అక్టోబరు 8: వృత్తి విద్య ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రయోగపూర్వక పరిజ్ఞానం పెరుగుతుందని మోడల్ స్కూల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. దసరా సెలవుల్లో మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థులకు వృత్తి విద్యపై ఇంటర్న్‌షిప్ కొనసాగుతుండగా మంగళవారం ప్రిన్సిపాల్ విద్యార్థులనుద్దేశించి పలు సూచనలు చేశారు. వృత్తి విద్యలో భాగంగా ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్‌కు సంబంధించి ఇంటర్న్‌షిప్ కొనసాగుతుందని ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షకుడు సెంటర్‌ట్రైనర్ సంపత్ విద్యార్థులకు వృత్తి విద్యపై వివరించారు. ఒకేషనల్ టీచర్లు సంజీవ్,ప్రేంసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలి

దండేపల్లి, ఆక్టోబరు 8: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సిబ్బందికి ఆదేశించారు. గూడెం గ్రామాన్ని మంగళవారం సందర్శించి పంచాయతీ కార్యాలయంలో రికార్డులు, రిజిష్టర్లులను తనిఖీ చేశారు. అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించారు. దుకాణాల వద్ద చెత్త వేస్తే జరిమానా విధిస్తామని యజమానులకు సూచించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటు ఉండి మంచి సేవలు అందించాలన్నారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా
ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిమ్ పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 8: అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబరు 21న జరిగే పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిమ్ పోటీలను నిర్వహిస్తున్నామని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండేలా తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి ఈ నెల 20వ తేదీ సాయంత్రంలోగా కమిషనరేట్ కార్యాలయంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో లేదా పోలీస్ పీఆర్‌ఓకు అందజేయాలన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని ఆసక్తి గల యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ముందుకు రావాలని సీపీ సూచించారు. వివరాలకు సెల్ : 8712656596, 8712656587 నెంబర్లను సంప్రదించాలని సీపీ తెలిపారు.

పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి
సిద్ధంగా ఉండాలి
బీజేపీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి

మంచిర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి శ్రేణులు సిద్ధంగా ఉండాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మంచిర్యాలలో పలువురు పార్టీ శ్రేణులను కలిసిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని, ప్రత్యామ్నాయంగా బీజేపీని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమాలతో పాటు, పట్టభద్రుల ఎన్నికల కోసం ఓటరు నమోదును కూడా పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. అధిష్ఠానం ఆదేశిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, తనకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. పార్టీ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు అర్జున్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల హేమాజీ, స్థానిక నాయకులు ముల్కల్ల మల్లారెడ్డి, తులా మధు సూధన్ రావు, బుస నరసింహరాములు, ఆకుల అశోకవర్ధన్, గోలి రాము, లింగన్నపేట విజయ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు
సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 8: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్ డీవో కిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఏ రకం ధాన్యానికి రూ.2, 320, సాధారణ రకానికి రూ.2,300లు మద్దతు ధర చెల్లించాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కేంద్రంలో టార్పాలిన్‌లు, మాయిశ్చర్ మీటర్, ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, నీడ, కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు వారి పరిధిలోని వ్యవసాయాధికారుల వద్ద నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని, అప్పుడే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులు కొన్న ధాన్యానికి నిర్వాహకులు రశీదులు అందించాలని, టాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

గర్మిళ్ల, అక్టోబరు 8: మంచిర్యాలలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో మంగళ వారం జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మోతె జయకృష్ణ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నాయని, ఇందుకోసం విద్యకు బడ్జెట్‌లో తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.కామన్ స్కూల్ సిస్టం ప్రవేశపెట్టి పేద, ధనిక వర్గాలకు ఒకే చోట విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, సభ్యులు జాకీర్, కుమార్,నాగలక్ష్మీ, కొండయ్య, శ్రీమన్నారాయణ, ప్రకాశం, రాజేశం, జైపాల్‌సింగ్, మల్లన్న, అరుణోదయ, వెంకటేశ్వర్లు, సురేష్, గంగాధర్ పాల్గొన్నారు.



కరెన్సీ నోట్లతో దుర్గాదేవికి అలంకరణ

చెన్నూరు పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో దుర్గామాతను మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులు కరెన్సీ నోట్లతో అలంకరించారు. రూ. 25,55,555లను దుర్గామాతకు అలంకరించారు.

- చెన్నూరు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే పూజలు

మందమర్రిలోని అంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో మంగళవారం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నానన్నారు. - మందమర్రి టౌన్



బాలగోపాల్ వర్ధంతి

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 8: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మానవ హక్కుల వేదిక ప్రొఫెసర్ డాక్టర్ బాలగోపాల్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు గోపాల్, మాదుగుల నవీన్, కోకిల శ్రీనివాస్, నర్సింగ్, మాదుగుల మల్లేష్, శంకర్, రఘు, రత్నం పోచమ్మ, సుమన్, సత్తయ్య, పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సద్దుల బతుకమ్మ

చెన్నూరు, అక్టోబరు 8: చెన్నూరు పట్టణంలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే తీరొక్క పూలను సేకరించిన మహిళలు బతుకమ్మలను పేర్చి స్థానిక ఆలయాల్లో బతుకమ్మ ఆడారు. పట్టణంలోని బ్రహ్మణ సంఘం పద్మశాలి, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. సీఐ రవీందర్, ఎస్ఐ శ్వేతలు బందోబస్తు నిర్వహించారు.



చెన్నూరులో శివాలయంలో బతుకమ్మలతో మహిళలు, మందమర్రిలో జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న జీఎం

బతుకమ్మ ఉత్సవాలకు తరలిరండి

మందమర్రిటౌన్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండగను ఈ నెల 10న సింగరేణి పాఠశాల మైదానంలో ఘనంగా నిర్వహిస్తామని జీఎం దేవేందర్ తెలిపారు. మంగళవారం సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ఫ్యామిలీ డే వేడుకలకు హాజరై మాట్లాడారు. బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ఉత్తమ బతుకమ్మలను ఎంపికచేసి బహుమతులు అందిస్తామన్నారు. కార్మికుల ఆహ్లాదం సింగరేణి లక్ష్యమన్నారు. ఫ్యామిలీడేకు పెద్ద ఎత్తున మహిళలు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు.

అనంతరం సీఈఆర్ క్లబ్ మైదానంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, సేవా సమితి అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ



వ్యాపారులకు గొడుగులు అందిస్తున్న వెంకటరమణ

కాసిపేట, అక్టోబరు 8: దేవాపూర్ ఓరియంట్ గోల్డ్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దేవాపూర్‌లోని చిరు వ్యాపారులకు మంగళవారం గొడుగులను అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గొంది వెంకరమణ మాట్లాడుతూ దేవాపూర్‌లో రోడ్ల పక్కన కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయించే చిరు వ్యాపారులు ఎండతో ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి గొడుగులను పంపిణీ చేశామన్నారు. నాయకులు వెంకటరమణరెడ్డి, కైలాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దండేపల్లి, అక్టోబరు 8: వెల్గనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2009-10లో పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు అందరూ ఒకచోట కలుసుకునేందుకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



వెల్గనూర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

జన్నారం, అక్టోబరు 8 : హర్యానాలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం హర్షణీయమని సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, నాయకులు రమేష్, సత్యం , కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

కాసిపేట, అక్టోబరు 8: శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సర్చ్ నిర్వహిస్తున్నామని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ట్యాంకు బస్తీలో పోలీసు సిబ్బంది, నార్కోటిక్ డాగ్ ఫోర్స్‌తో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణ అందరి బాధ్యత అన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎవరైనా భూకబ్జాలకు, భూ సంబంధిత గొడవల్లో పాల్గొని అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలుంటాయని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 36 బైక్‌లు, 2 ఆటోలను సీజ్ చేశారు. బెల్టుషాపుల్లో తనిఖీలు చేసి రూ.7606 విలువ గల మద్యం సీజ్ చేశారు. కాసిపేట, దేవాపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్ ఎస్ఐ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డాగ్ ద్వారా తనిఖీలు నిర్వహించామని సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. యువకులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి రవాణా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐ మహేందర్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

యువకుడి ఆత్మహత్య

చెన్నూరు, అక్టోబరు 8: చింతలపల్లి గ్రామానికి చెందిన అల్లంపల్లి పోచన్న (38) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోచన్నకు 15 ఏండ్ల క్రితం స్వరూపతో వివాహం జరిగింది. వీరికి పిల్లలు పుట్టలేదు. దీంతో మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో పోచన్న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి పోచన్న మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు.

మందమర్రిలో...

మందమర్రిటౌన్, అక్టోబరు 8: పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన మామిడాల తిరుపతి (32) సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు సంవత్సరాల క్రితం మంచిర్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. కుడి కాలు విరగడంతో ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. మృతుడి తండ్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఉరి వేసుకుని యువతి...

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 8: చాకపల్లి గ్రామానికి చెందిన జక్కం అంజలి (18) సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మూడు సంవత్సరాల క్రితం నుంచి చిన్నగుడిపేట గ్రామానికి చెందిన యాటకర్ల రాజు అంజలి ప్రేమించుకుంటున్నారు. ఇటీవల అంజలికి ఫోన్ చేసి రూ.5 లక్షలు కట్నం ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని, దూషించడంతోపాటు ఫోన్ బిజీ వస్తుందని, ఎవరితో మాట్లాడుతున్నావని అనుమానించడంతో అంజలి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తల్లి విమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 8: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేష్ మంగళవారం తెలిపారు. రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ డ్రెంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా బూదాకలాన్ గ్రామానికి చెందిన జంగంపల్లి సాయిహర్షిత్, కోట శేషిలు పట్టుబడ్డారు. బెల్లంపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

చెన్నూరు, అక్టోబరు 8: వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని అక్కెపల్లిలో మంగళవారం డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులను చంపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కరెంటు వైర్లు, ఉచ్చులు బిగించి చంపితే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు విధిస్తారన్నారు. మాజీ సర్పంచు రాజన్న, మాజీ ఎంపీటీసీ పోశం, ఎఫ్ఎ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ ఫలితాల్లో సత్తా



ప్రసాద్

దహెగాం, అక్టోబరు 8: సింగరేణి కాలరీస్ కంపెనీ అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ మెకానికల్ ఫలితాలలో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఖర్జీ గ్రామానికి చెందిన లంగారి ప్రసాద్ సత్త చాటారు. మంగళవారం విడుదలైన అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ ఫలితాల్లో 120 మార్కులకు గాను 96 మార్కులు కటాఫ్‌లో 100కి 80 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. మొత్తం ముగ్గురు ఎంపిక కాగా ప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచాడు. మండలంలోని ఖర్జీ గ్రామానికి చెందిన రైతు లంగారి రుషన్న-శారద దంపతుల కుమారుడు ప్రసాద్ ప్రస్తుతం ఎంటెక్ చేస్తున్నాడు. ఆగస్టు 7వ తేదీన సింగరేణి కాలరీస్ సంస్థ నిర్వహించిన అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ మెకానికల్ పరీక్షలు రాశాడు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెంచికలపేట, అక్టోబరు 8: ఎల్కపల్లి గ్రామానికి చెందిన జునుగరి రామన్నకు రూ.54 వేలు, ఎల్లూరు గ్రామానికి చెందిన డోకె మల్లుకు రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో మధుకర్, సత్యనారాయణ, నాగేష్, వెంకన్న, వెంకన్న, ప్రభాకర్, సాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితా రూపొందించాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 8: పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా వేగంగా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్‌తో జాబితా రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ విడుదల చేశామని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయుల నుంచి ఓటరు జాబితాలో వివరాల నమోదు కోసం నవంబరు 6 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అర్హత గల వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం-18, ఉపాధ్యాయుల కోసం ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 21కి ముందు డిగ్రీ పూర్తి అయిన వారి నుంచి పట్టభద్రుల ఓటరు జాబితాలో పేర్లు నమోదు కోసం సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. ఈ మేరకు అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుతో పాటు తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

మహాలక్ష్మి అవతారంలో అమ్మవారి దర్శనం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, అక్టోబరు 8: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహాలక్ష్మి అవతారంలో దుర్గామాత దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ కన్యాకపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు రూ.55,55,555లతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే బంగారు చీరెతో కూడా అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులకు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక భగత్‌సింగ్‌లో రోడ్‌లో ఏర్పాటు చేసి దుర్గామాత వద్ద మంగళవారం ఆదిలాబాద్ ఎంఎల్‌సీ దండే విఠల్ పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి భిక్షపతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే రెబ్బెన మండలంలో ఇందిరనగర్‌లోని కనకదుర్గాదేవి మహంకాళి ఆలయంలో మంగళవారం మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చింది. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా వొడి బియ్యం, నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవర వినోద్, ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: పట్టణంలోని సాయినగర్ భజరంగ్ యూత్ దుర్గాదేవి మండపం వద్ద కుంకుమార్చన పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దస్నాపూర్ కాలనీలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శారదాదేవి మండలి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెంచికలపేట: మండలంలోని ఎల్లూరు గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన పూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలి



హెచ్‌పీ గ్యాస్ స్టౌవ్‌ను పంపిణీ చేస్తున్న ఎస్సై కమలాకర్

సిర్పూర్(టి), అక్టోబరు 8: హెచ్‌పీ గ్యాస్ మారుమూల ప్రాంతాలకు సరఫరా చేసే హెచ్‌పీ గ్రామీణ వికాస్ స్టౌవ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కమలాకర్ అన్నారు. మంగళ వారం ఏజెన్సీ వద్ద గ్రామీణ వికాస లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కంపెనీ రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు లక్కీడీప్ ద్వారా కొన్ని వస్తువులను ఇవ్వనుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌పీ డీలర్ ఖుర్షిద్ హుస్సేన్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయించొద్దు

- ఎల్కపల్లి(బి) గ్రామస్థుల తీర్మానం

బెజ్జూరు, అక్టోబరు 8: గ్రామంలో ఎవరూ గుడుంబా విక్రయించొద్దు, తాగొద్దని గ్రామస్థులు మంగళవారం తీర్మానం చేశారు. బెజ్జూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లి(బి) గ్రామస్థులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో గుడుంబా విక్రయించరాదని, సేవించరాదని తీర్మానం చేశారు. యువత రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఇలాంటి సంఘటనలు జరగకుండా మద్యం నిషేధించాలని తీర్మానం చేశారు. అనంతరం ఎస్సైకి వినతి పత్రం అందజేయగా ఆయన అభినందించారు.

లాభాల బాటలో ఎస్పీఎం

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 8: ఎస్పీఎం పునరుద్ధరణ అనంతరం ప్రస్తుతం లాభాల బాటలో ఉందని జీఎం ఎంఎస్ గిరి తెలిపారు. స్థానిక మిల్లులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లు పునరుద్ధరణ తర్వాత నష్టాల నుంచి లాభాల బాటలోకి వచ్చిందన్నారు. స్థానిక అసోసియేషన్ సభ్యులు చర్చకు రావాలే తప్పా నిర్బంధంగా లోడ్ లారీలు నిలిపివేసి చేసి సమ్మెకు దిగడం సరికాదన్నారు. చర్చలకు తాము అనుకూలంగా ఉన్నామని చెప్పారు. 33 లోడ్ లారీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో చీఫ్ మేనేజర్ రమేశ్‌రావు, కమర్షియ్ జీఎం అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● ఆసిఫాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి యశస్వి పథకం కింద ఉపకార వేతనాల కోసం 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.75 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షల చొప్పున ఉపకార వేతనాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● దహెగాం: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు కుసుమ, పొద్దు తిరుగుడు పంట సాగుపై యజమాన్య పద్ధతులపై ఏడీవో శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

- మండలంలోని చిన్నరాస్పెల్లి గ్రామంలో పత్తి పంట క్రా ప్ సర్వేను ఏడీవో శ్రీనివాసరావు నిర్వహించారు.

● వాంకిడి: మండలంలోని కొత్తదుబ్బగూడ గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు.

● కెరమెరి: కుమరం భీం వర్ధంతి కరపత్రాలను, ఆహ్వాన పత్రికలను మంగళవారం ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా ఉట్నూరులో ఆవిష్కరించారు.

● తిర్యాణి: తిర్యాణి మండల పరిధిలో ఉన్న సింగరేణి ఉపరితల బొగ్గు గనులలో స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని మంగళవారం గోలేటి సింగరేణి జీఎంకు ఆదివాసీ తుడుందెబ్బ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

డిజిటల్ క్రాప్ సర్వేకు విముఖత

రైతులు పండిస్తున్న పంటల సాగును డిజిటలైజేషన్ చేసేందుకు కేంద్రప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) తమ వల్ల కాదని ఏఈవోలు చేతులెత్తేశారు. సిబ్బంది కొరత, తీవ్రమైన పని ఒత్తిడి వంటి కారణాలతో విముఖత చూపుతున్నారు.

- పంటల వివరాల సేకరణకు ఏఈవోలు ససేమిరా
- ఇప్పటికే పనిభారం ఉందని ఆవేదన
- కొత్త బాధ్యత మోయలేమంటున్న వ్యవసాయ విస్తరణాధికారులు
- జిల్లాలో 4.23 లక్షల ఎకరాల సాగు భూమి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 8: రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా ఆ న్‌లైన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ క్రాప్ సర్వే'(డీసీఎస్)ను తీసుకొచ్చింది. గతంలో మాన్యువల్‌గా వానాకాలం, యాసంగి సీజన్‌లో పంటల నమోదు చేస్తూ ఆన్‌లైన్ చేసే వారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తున్న సబ్సిడీ సొమ్ముకు పారదర్శకత ఉండాలనే భావనతో డిజిటల్ సర్వే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు నిర్ణయించి ఆ బాధ్యతలను ఏఈవోలకు అప్పగించింది. దేశంలోని మహరాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో క్రాప్ బుకింగ్ సర్వేకు విస్తరణాధికారికి అనుబంధంగా సహాయకులను నియమించారు. తెలంగాణలో ప్రస్తుతం ఏఈవోలపై రకరకాల పథకాల నిర్వహణ బాధ్యతలు ఉండడం, అసిస్టెంట్లు లేకపోవడం తో ఈ సర్వే భారంగా మారనుంది. ఒక్కరితో డిజిటల్ సర్వే కష్టమని భావించిన ఏఈవోలు తమకు తోడుగా వెయ్యి ఎకరాలకు ఒక్క వీఏఏ (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లను నియమించాలని కోరుతున్నారు.

వీఏఏలను నియమించాలి..

- చిరంజీవి, ఏఈవో, రహపల్లి



డిజిటల్ క్రాప్ సర్వేను విజయవంతంగా అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాల మాదిరిగా వేయి ఎకరాలకు ఒక తాత్కాలిక వీఏఏను నియమిం చాలి. దీంతో అనుకున్న సమయంలో పూర్తి చేయ గలుగుతాం. ప్రభు త్వం దీనిపై నిర్ణయం తీసుకోవాలి.

ఇప్పటికే పనిభారం..

- శ్రీవిద్య, ఏఈవో, పెంచికల్‌పేట



ఇప్పటికే మాపై పనిభారం ఉంది. రైతుబంధు, రైతుబీమా తదితర పనులతో ఏఈవోలపై ఒత్తిడి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో కేవ లం ఏఈవోలు మాత్రమే డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించాలనం సరి కాదు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

రైతు ప్రయోజనాలకే..

రైతు ప్రయోజనం కల్పించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ సామర్థ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా రైతు సా గు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయికి వెళ్లి పక్కగా నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వేనంబర్‌కు దూరంగా ఉంటే యాప్‌లో నమోదుకావని అధికారులు చెబుతున్నారు. సర్వే ఆధారంగా పంటల కొనుగోలు, ఎగుమతులు, మార్కెటింగ్‌తో పాటు ప్రకృతి వైపరీత్యాలతో జరిగే నష్టాన్ని అంచనా వేసేందుకు డిజిటల్ క్రాప్ సర్వే సహాయ పడనుంది.

జిల్లాలో 70 క్లస్టర్లు..

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల పరిధిలో 70 మంది ఏఈవోలు, 70 క్లస్టర్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 4.23 లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా 1.34 మంది రైతులు ఉన్నా రు. ప్రస్తుతం ఏఈవోలు రైతు భరోసా, రైతు బీమా, సీఎం కిసాన్, పంటల కొనుగోలు కేంద్రాలు, పంట కోత ప్రయోగాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టం అంచనా, అవ గాహన సదస్సులు ఇలా 49 రకాల పనులు చేస్తూనే మరో వైపు పంట నమోదును పకడ్బం దీగా చేపడుతున్నారు. పక్క రాష్ట్రాలలో తెలంగాణ మాదిరిగా పథకాలు లేకపోవడం అక్కడ వీఏవోలు ఉండడంతో డిజిటల్ సర్వేకు ఆటంకాలు లేవు. మన రాష్ట్రంలో కూడా వేయి ఎకరాలకు ఒక వీఏవోను నియమించాలని అభిప్రాయపడుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 8: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను రికార్డులు సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామంలో మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సంబంధిత ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో అనుమతి లేని లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం అందిన దరఖాస్తులను రికార్డులు సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. సదరు ప్లాట్ల భౌగోళిక స్థితిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, వాగు సంబంధిత భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి దరఖాస్తు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో అందిన దరఖాస్తులకు సంబం ధించి భూముల సర్వే నంబరు ప్రకారం రికార్డులు, మ్యాప్‌లు సరి చూసుకొని తదుపరి చర్యలు తీసుకోవాలని చెప్పారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆయన వెంట డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ముందుండాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



మెడికల్ సీటు సాధించిన మాజీ జడ్పీటీసీ నీరేటి రేఖ కుమారుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

సిర్పూర్(టి), అక్టోబరు 8: బీజేపీ సభ్యత్వ నమోదులో సిర్పూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ముందుంచాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామాల్లో ఐదు వేల సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ప్రతి సభ్యత్వ నమోదులో వారి ఆధార్ కార్డు, సెల్‌నంబర్, పూర్తి బయోడెటా నింపాలన్నారు. దీంతో పార్టీలో క్రియాశీలక పాత్ర ఉంటుందన్నారు. అలాగే సిర్పూర్(టి) మాజీ జడ్పీటీసీ నీరేటి రేఖ, సత్యనారాయణల కుమారుడు తేజారెడ్డి కరీంనగర్ జిల్లాలోని ప్రతిమ మెడికల్ కాలేజీలో సీటు సాధించడంతో ఆయనను శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో నియోజక వర్గం నుంచి యువకులు వైద్య రంగంలో రాణించాలన్నారు. అనంతరం చీలపల్లి గ్రామానికి చెందిన యువ కులు చీలపల్లికి రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. మాజీ కో ఆప్షన్ సయ్యద్ అహ్మద్ అలీ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొంది ఇంటికి రాగా ఆయ నను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, శంకర్, సత్యనారాయణ, అశోక్, లావణ్య, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రాథమిక సభ్యత్వ నమోదు ప్రక్రియను కార్యకర్తలు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని పార్టీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌గౌడ్, వానుపటేల్, మల్లయ్య, మిథున్, కవిరాజ్, సత్తయ్య, భీమన్న, బండురావు, తిరుపతిగౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబరాలు



కోర్టు ఆవరణలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 8: ఆసిఫాబాద్ పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి యువరాజ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. వేడుకల్లో జిల్లా కోర్టులోని ఉద్యోగులందరు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం ఆర్టీసీ మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీఎం విశ్వనాథ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్టీఐ సరియ, ఎంఎఫ్ ఉదయ్, టీఐ భారతి పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం

కాగజ్‌నగర్, అక్టోబరు 8: కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో రాకపోకలు సాగిస్తున్న బస్సుల రూట్లపై డీఎం వివరించారు. అలాగే బస్టాండులో నెలకొన్న పలు సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

వాంకిడి, అక్టోబరు 8: వాంకిడి మండలం బనార్‌కోసార గ్రామ శివారులో మంగళవారం పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నామని ఎస్సై ప్రశాంత్ తెలిపారు. గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరు దాడి చేయగా ఆరుగు పట్టుబడ్డారని, వారి నుంచి రూ. 2,200 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. పేకాట స్థావరాలు గమనిస్తే స్థానికులు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి

వాంకిడి, అక్టోబరు 8: క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. బతుకమ్మ, దసరా పండగలను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, జీవన్, జయరాం, గణేష్, అనీల్, దాదాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 8: రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రమేశ్ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 11 నుంచి నిర్వహించే 53వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల, మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి పయణమయ్యారు. మహిళా జట్టుకు కెప్టెన్‌గా రమ్య, పురుషుల జట్టుకు కెప్టెన్‌గా సాయిని ప్రకటించినట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్య దర్శి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, కోచ్‌లు అరవింద్, విష్ణు, రాకేష్, సాయి, సత్తన్న, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 8: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరమే న్యాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అట్రాసిటీ బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 2016 నుంచి 2024 వరకు 288 కేసులు నమోదయ్యాయని చెప్పారు. పోలీసు స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నంబంధిత పిటిషన్లు త్వరగా తీసుకుని తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. పీడీ యాక్ట్, చార్జి షీటు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జైనూరు మండల ఘనటలో డీఎస్పీతో కలిసి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రతి మండలంలో ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవం తప్పని సరిగా నిర్వహించాలని తహసీల్దార్, పోలీసుఅధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, కమిటీ సభ్యులు ప్రజాప్రతినిదులకు దినోత్సవ నిర్వహణపై సమాచారం అందించాలని అన్నారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించి బాధితులకు ఆర్థిక సహాయం పంపిణీ చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 288 కేసులు నమోదు కాగా 36 తప్పుడు కేసులుగా నిర్ధారించారని వివరించారు. 102 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 13 కేసులు విచారణ జరుగుతున్నాయని, త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసులలో 209 మంది ఎస్సీ, 206 మంది ఎస్టీ బాధితులకు రూ.2.33 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. గ్రామాల్లో యువత వ్యసనాలకు బానిసలు కాకుండా బెల్టు షాపుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆబ్కారి, మద్యనిషేద శాఖాధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో అందరికి మంచి విలువలు, హక్కులు ఉండాలని చెప్పారు. ప్రజారక్షణలో అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్దామని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల ముహిళలకు ఆర్థిక రుణ సదుపాయాన్ని కల్పించి ప్రోత్సహిస్తోందని తెలిపారు. జిల్లాలో జైనూరు, సిర్పూర్‌తో పాటు వివిధ మండలాల్లో మహిళలకు అవసరమైన శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి సజీవన్, గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రమాదేవి డీపీఆర్‌వో సంపత్‌కుమార్, డీవీఏహెచ్‌వో సురేష్‌కుమార్, విజిలెన్స్ కమిటీ సభ్యులు కేశవరావు, గణేశ్, అశోక్, గోపాల్‌నాయ్, అర్జున్, గంగుబాయి జిల్లా అధికారులు, విజిలెన్స్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్ రూరల్: కుమరం భీం వర్ధంతి సభ 17వ తేదీన నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. అలాగే ఈ నెల 22న భీం జయంతి ఏర్పాట్లను ఆయన స్వగ్రామమైన పాతరౌటలో చేపడుతున్నందున మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెలలో భారీ వర్షాలకు నంబాల నుంచి పాతరౌట వెళ్లే రహదారి మధ్య కల్వర్టు కొట్టుకుపోయిందన్నారు. మరమ్మతుల కోసం రూ.1.2 లక్షలు మంజూరు చేయడంతో పనులు పూర్తయ్యాయని చెప్పారు. కల్వర్టు పనులను సైతం కలెక్టర్ పరిశీలించారు. గ్రామస్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్‌రావు, డీఈ కృష్ణ, మాజీ సర్పంచ్ కిష్టయ్య, ప్రత్యేకాధికారి తదితరులు పాల్గొన్నారు.



మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జీఎం బి సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, అక్టోబరు 8: శ్రీరాంపూర్ ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీని ఏర్పాటు చేసి గనులు, విభాగాలలో సంస్థ పురోగతిని ఉద్యోగులకు తెలియజేయాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ పరిస్థితిని తెలియజేస్తూ బొగ్గు ఉత్పత్తిని పెంచేలా కృషి చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, పీవోలు శ్రీనివాస్, ఏవీరెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, శ్రీధర్, డీజీఎంలు చిరంజీవులు, రవీందర్, రాజేశ్వర్, చంద్రలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి

శ్రీరాంపూర్, అక్టోబరు 8: సింగరేణి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య అన్నారు. ఆర్కే 5 గనిలో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్‌పాల్గొన్నారు.

సౌకర్యాలు లేక ఇబ్బందులు

కాసిపేట, అక్టోబరు 8: కాసిపేట 2వ గనిలో సౌకర్యా లు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని హెచ్ఎం ఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం కాసిపేట 2వ గనిపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘం లాభాల వాటాపై తప్పుడు సమాచారం ఇస్తూ కార్మికులను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెల్ది సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రక్షణే ధ్యేయం : జీఎం దేవేందర్



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

కాసిపేట, అక్టోబరు 8: కార్మికుల సంక్షేమం, రక్షణ కోసమే శాంతి హోమం నిర్వహిస్తున్నామని మందమర్రి జీఎం దేవేందర్ అ న్నారు. కాసిపేట 2గనిలోని మైసమ్మ తల్లి ఆలయంలో మంగళవారం నిర్వహించిన శాంతి హోమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడు తూ కార్మికులు ఆయురా రోగ్యాలతో పాటు ఆనందంగా ఉండాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, గ్రూపుఏజెంటు రాందాస్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కాసిపేట 2 గని మేనేజర్ లక్ష్మీనారాయణ, నాయకులు గొల్ల శ్రీనివాస్, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల బతుకమ్మ ఆట

శ్రీరాంపూర్, అక్టోబరు 8: శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు మంగళవారం జీఎం కార్యాలయం ఎదుట ఉన్న కేంద్ర నర్సరీలో బతుకమ్మ ఆట ఆడారు. ముఖ్య అతిథులుగా జీఎం బి సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, జీఎం(మార్కెటింగ్) రవి ప్రసాద్ హాజర య్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డు ఎస్‌వోటూ జీఎం మృతి



రాంమూర్తి(ఫైల్)

మందమర్రి టౌన్, అక్టోబర్ 8: మందమర్రి ఏరియాలో ఎస్‌వోటూ జీఎంగా పని చేసి రిటైర్డు అయిన రాంమూర్తి (65) హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. రాంమూర్తికి భార్య, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేపేందుకు యత్నించగా కింద పడిపోయారు. ఆసుపత్రికి తరలించగా అప్ప టికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బెల్లంపల్లిలో ఏరియాలో ఆయన పని చేయడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

గనులపై పూజలు, అన్నదానాలు

శ్రీరాంపూర్, అక్టోబరు 8: శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలోని గనులపై మంగళవారం పూజలు, అన్నదానాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్ఆర్‌పీ 1 గనిపై ఉన్న మైసమ్మ తల్లి ఆలయంలో ఉదయం శాంతి మహా చండీయాగం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన హోమంలో ఏరియా జీఎం బి సంజీవరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో పూజలు

మందమర్రి టౌన్, అక్టోబర్ 8: ఏరియాలోని వర్క్‌షాప్‌లోని దుర్గామాత ఆలయం వద్ద మంగళవారం కార్మిక సంఘాల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు కాంపె ల్లి సమ్మయ్య, దేవి భూమయ్యతో పాటు ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బీమనాథుని సుదర్శన్ పాల్గొన్నారు.

కాసిపేట- 2 గనిపై దొంగల బెడద

కాసిపేట, అక్టోబరు 8: కాసిపేట 2వ గనిలో తరుచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. గనికి ప్రహరీ గోడ లేకపోవడంతో పరిసర ప్రాంతాల నుంచి దుండగులు వచ్చి విలువైన సామగ్రి ఎత్తుకెళ్తున్నారు. మంగళవారం ఉదయం మైన్ నుంచిమ్యాగ్జిన్ వరకు ఉన్న కరెంటు వైర్లను ఎత్తుకెళ్లేందుకు నలుగురు వ్యక్తులు గనిలోకి చొరబడ్డారు. గమనించిన కార్మికులు పట్టుకుని స్థానికులకు అప్పగించారు.

లాభాల బోనస్ కోసం బ్యాంకుల్లో రద్దీ

మందమర్రి టౌన్, అక్టోబరు 8: కోల్‌బెల్టు ప్రాంతాలైన మంచిర్యాల, గోలేటి, లక్సెట్టిపేట, మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, తాండూర్, కాసిపేట, రెబ్బెన, చెన్నూరు పరిధిలోని బ్యాంకుల్లో లాభాల వాటా డబ్బులు తీసుకునేందుకు కార్మికులు క్యూ కట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి యాజమాన్యం లాభాల వాటా వారి ఖాతాల్లో జమ చేసింది. ఏటీఎం నుంచి అవసరమైన మేర డబ్బులు రావనే భావనతో బ్యాంకులకు చెక్కులతో వెళ్లారు.

దోపిడీని అరికట్టాలి

వాంకిడి, అక్టోబరు 8: పత్తి రైతులను వ్యాపారులు దోపిడీ చేస్తున్నారని, అధికారులు దీన్ని అరికట్టాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాంకిడి మండలంలో యధేచ్ఛగా పత్తి కాంటాలు నిర్వహిస్తూ వ్యాపారులు అమాయక రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. పత్తి తూకంలో రైతులను మోసం చేస్తూ దళారులు అక్రమంగా దోచుకుంటున్నారని చెప్పారు. జిల్లాలో ప్రతి మండలంలో ఒపెన్ బీట్ మార్కెట్ నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.